
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4, కనిష్ఠం 24.2



నిజామాబాద్
జిల్లా వార్తలు

శుక్రవారం 13 సెప్టెంబరు 2024



● దత్తాపూరులో కుటుంబ సభ్యుల ఇంటి దగ్గర నుంచి ఫొటో అప్లోడ్ చేస్తున్న అధికారులు

వైద్య ఆరోగ్య శాఖ పనితీరును
పటిష్ట పర్చాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మోపాల్, సెప్టెంబరు 12: వైద్య ఆరోగ్య శాఖ పనితీరును మరింత పటిష్ట పరిచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. గురువారం మోపాల్ మండలం ముదక్‌పల్లిలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను, ఔషధాలు, నిలువ ఉంచిన స్టోర్ రూమ్, రోగుల ఇన్‌పేషెంట్ వార్డు, ల్యాబ్ తదితర వార్డులను సందర్శించి రిజిస్టర్‌లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది గురించి ఆరాతీయగా పలువురు అందుబాటులో లేకపోవడం వల్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముదక్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలో డెంగీ కేసులు నమోదు అవుతుండటాన్ని గమనించి అందుకు గల కారణాలు ఏమిటని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా గల అన్ని పీహెచ్‌సీలు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రతిరోజూ ఉదయం వేళల్లోనే అటెండెన్స్‌ను పర్యవేక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖలో స్పష్టమైన మార్పు కనిపించేలా క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరును గాడిలో పెట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని ఆసుపత్రులు, పీహెచ్‌సీల వైద్యులతో సమీక్ష నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో వైద్య సేవలు అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ఎక్కడైనా పీహెచ్‌సీలో వైద్యాధికారి సెలవుల్లో ఉంటే ఇతర ఆసుపత్రుల నుంచి ప్రత్యామ్నాయంగా వైద్యులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించాలని సూచించారు. పాము, కుక్కకాటు మందులతో పాటు అన్ని అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.



● ముదక్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



దరఖాస్తుల వెల్లువ

- జిల్లాలో రుణమాఫీ కోసం దరఖాస్తులను అందజేస్తున్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా రైతుల వివరాలు సేకరిస్తున్న నోడల్ అధికారులు
- రుణమాఫీ కోసం ఇప్పటి వరకు 30వేలకు పైగా దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతు రుణమాఫీ కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. రుణమాఫీ కాని రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామాలకు వెళ్లి ఆయా రైతుల కుటుంబాలను నిర్ధారణ చేసుకున్నారు. ఆ కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలను తీసుకుంటున్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్ చేస్తూ సెల్ఫీ తీసుకుంటూ వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన రుణమాఫీ యాప్‌లో వారి వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలను తీసుకుంటూనే కుటుంబ యజమాని నుంచి రుణమాఫీ కోసం అఫిడవిట్‌ను తీసుకుంటున్నారు. కుటుంబ పెద్ద లేదా రుణం తీసుకున్న వారి సంతకాలను తీసుకుంటూ నమోదు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు కూడా తప్పని సరిగా రుణమాఫీ కోసం గ్రామాలకు వచ్చి సెల్ఫీ దిగుతున్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్ కోసం కావాల్సిన సర్టిఫికెట్లను అందిస్తున్నారు. గత పదిహేను రోజులుగా ఈ వివరాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు మరో వారం రోజుల్లోపు పూర్తి చేసే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు.

మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు

జిల్లాలో మొదటి విడతలో 44వేల 469 మంది రైతులకు 225.62 కోట్ల రూపాయల రుణం మాఫీ చేశారు. రెండో విడతలో 22 వేల 868 మందికి 210.54 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. మూడో విడతలో 15వేల 724 మంది రైతులకు 190.33 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. ఈ రైతులకు కొత్త రుణాలను ఇవ్వాలని ఆదేశాలను ఇచ్చారు. ఆయా బ్యాంకుల పరిధిలో రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలను కూడా మంజూరు చేస్తున్నారు. కొన్ని బ్యాంకుల పరిధిలో రుణాలను రిన్యూవల్ చేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలను అందిస్తున్నారు. రైతులు వేసే పంటల ఆధారంగా ఈ రుణ పంపిణీ చేస్తున్నారు.

46వేల మందికి పైగా రుణమాఫీ కాని రైతులు

రెండులక్షల లోపు రుణం ఉండి కుటుంబ నిర్ధారణ కాని రేషన్ కార్డు లేని రైతుల రుణాలను మాఫీ చేసేందుకు అన్ని జిల్లాల పరిధిలో చర్యలు చేపట్టింది. ఈ రైతులు రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షలకు పైగా ఉండటం వల్ల వ్యవసాయ అధికారుల ద్వారా వారి వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో కూడా కుటుంబ సభ్యుల నిర్ధారణ కాకుండా రేషన్ కార్డు లేకపోవడం వల్ల రుణమాఫీ కాని రైతులు 46వేలకు పైగా ఉన్నారు. వారి వివరాలను గత 15 రోజులుగా మండల స్థాయిలోని వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ రేషన్ కార్డు లేకుండా కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని ప్రభుత్వం ఇచ్చిన లిస్టులో ఉన్న వారి పేర్లను ఆధారంగా వివరాలను తీసుకుంటున్నారు. రుణం తీసుకున్నకుటుం బ పెద్దతో పాటు వారి కుటుంబ సభ్యులను పరిశీలించడంతో పాటు ఆధార్ వివరాలను తీసుకుంటున్నారు. కుటుంబ పెద్ద నుంచి రుణమాఫీ చేయాలని అఫిడవిట్‌ను తీసుకోవడంతో పాటు అన్ని వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో అక్కడి కక్కడే నమోదు చేస్తున్నారు. ఆ రైతు కుటుంబ సభ్యులను నిర్ధారిస్తూ సెల్ఫీని కూడా యాప్‌లో పొందుపరుస్తున్నారు. జిల్లాలో గత 15 రోజులుగా వివరాలను తీసుకుంటున్న అధికారులు ఇప్పటి వరకు 30వేల 614 మంది రైతుల నుంచి వివరాలను సేకరిం చారు. మిగతా రైతుల వివరాలను కూ డా మరో వారం రోజుల్లో పూర్తిచేసే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. తమ పరిధిలోని గ్రామాలకు ఒక్కొక్క రోజు కేటాయిస్తూ ఈ వివరాలను తీసుకుంటున్నారు. రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకో వడంవల్ల ఈ రైతులకు రుణ మాఫీ కాలేదు. వీరికి రేషన్ కార్డు లేకపోవడం వల్ల కుటుంబ సభ్యుల నిర్ధారణ కాలేదు. జిల్లా వ్యాప్తంగా 46వేల మంది ఉన్న వీరిలో కొంత మంది గల్ఫ్‌కు వెళ్లిన రైతులతో పాటు ఎన్ఆర్ఐ రైతులు కూడా ఉన్నారు. వీరి వివరాలను మాత్రం ఇంకా తీసుకోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల వివరాలతో పాటు కుటుంబ పెద్దతో కలిసి సెల్ఫీ తీసుకోవాల్సి ఉండటం వల్ల అది సాధ్యం కావడం లేదు. గల్ఫ్‌లో ఉన్న రైతులతో పాటు ఎన్ఆర్ఐ రైతుల వివరాలను మినహాయించి ఇతర రైతుల వివరాలను తీసుకుంటున్నారు. వారి ఫ్యామిలీని నిర్ధారిస్తూ వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ వివరాలు పూర్తిగా నమోదైన తర్వాత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఈ రైతులకు కూడా రుణమాఫీ జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో రేషన్ కార్డు లేని రైతుల వివరాలను తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. వారి కుటుంబ సభ్యులను నిర్ధారిస్తూ ఫ్యామిలీ గ్రూపింగ్ చేయడంతో పాటు సెల్ఫీ, అఫిడవిట్‌ను నమోదు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 70శాతానికి పైగా వివరాలను సేకరించామని మిగతా రైతుల వివరాలను కూడా వారం రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

డొంకేశ్వర్‌లో దరఖాస్తుల స్వీకరణ..

డొంకేశ్వర్, సెప్టెంబరు 12: మండలంలోని అన్నారం, సిర్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నోడల్ అధికారి ప్రశాంత్, ఏఈవో మౌనిక రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గురువారం రేషన్ కార్డులేని వారిని గుర్తించి కుటుంబ నిర్ధారణ చేశారు. కుటుంబసభ్యుల ఫొటోలు వెబ్‌సైట్‌లో పొందు పర్చారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, అర్హులైనప్పటికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో ప్రభుత్వం అధికారులనే గ్రామాల్లోకి పంపించింది. అర్హులైన రైతుల వివరాలను సేకరించాలని ఆదేశించింది.



అన్నారంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నోడల్ అధికారి, ఏఈవో

ఎస్సారెస్పీలోకి 40వేల క్యూసెక్కుల ఎన్‌ఫ్లో

● కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల



మెండోర, సెప్టెంబరు 12: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు నిండి జలకళను సంతరించుకుంది. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి పరిసర ప్రాంతాల నుంచి వరద భారీగా చేరడంతో ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి 40వేల945క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నాలుగు వరద గేట్ల ద్వారా 12వేల 480క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఉదయం ప్రాజెక్టులోకి ఉదయం 34వేల క్యూసెక్కుల వరద చేరగా రెండు వరద గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం ప్రాజెక్టులోకి వరద పెరగడంతో మరో రెండు వరద గేట్లను ఎత్తి నాలుగు గేట్ల ద్వారా గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 6వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2వేల క్యూసెక్కులు, అవిరి రూపంలో 684క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231క్యూసెక్కులు, వరద కాలువకు 19వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 400క్యూసెక్కులు నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీ)లు కాగా గురువారం సాయంత్రం 1091.00అడుగులు (80.5.టీఎంసీ)లు కాగా గురువారం సాయంత్రం 1091.00అడుగులు (80.501టీఎంసీ) నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజు ప్రాజెక్టులో 1091.00 అడుగులు (80.501టీఎంసీ) నీటి నిల్వ ఉందని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 176టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు నుంచి ప్రధానకాలువలకు 102టీఎంసీల నీరు విడుదల చేయడం జరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



కళాశాలలకు
ఫిజికల్ డైరెక్టర్లు కరువు



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 ఇంటర్మీడిట్ కళాశాలలు
- ప్రస్తుతం ఒక ఫిజికల్ డైరెక్టర్ లేని వైనం
- పీడీలు లేక మరుగున పడుతున్న క్రీడలు, నష్టపోతున్న క్రీడాకారులు
- జీవో 40 రద్దుతో ఫిజికల్ డైరెక్టర్ల కరువు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ) కరువయ్యారు. కొంత కాలంగా ఒక్క ఫిజికల్ డైరెక్టర్ కూడా లేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 34ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఉంటే వాటిలో ఒక్కదానికి కూడా ఫిజికల్ డైరెక్టర్ లేదు. గతంలో కొన్ని కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్లు ఉండగా వారు రిటైర్డ్ అయ్యారు. గత సంవత్సరం సైతం ఒకే పీడీతో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ క్రీడలను నిర్వహించింది. అయితే ఆయన కూడా రిటైర్డ్ కావడంతో ప్రస్తుతం జిల్లాలో ఇంటర్మీడియెట్ కళాశాలల్లో క్రీడల పరిస్థితి అగమ్యగోచారంగా తయారైంది. క్రీడలు ఆడే వారు ఉన్నా కోచ్‌లు లేకపోవడంతో వారి ప్రతిభను బయటకు తెచ్చే నాథుడు లేడు.

2003 నుంచి ఫిజికల్ డైరెక్టర్ల రిక్రూట్‌మెంట్ లేదు..

క్రీడల అభివృద్ధి కోసం ప్రతీ కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ ఉండాలి. అయితే కొన్ని సంవత్సరాలుగా కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌లు లేకపోవడంతో క్రీడలు మరుగున పడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2003 నుంచి ఫిజికల్ డైరెక్టర్‌గా రిక్రూట్‌మెంట్ జరగలేదు. దానికి తోడు జీవో 40 రద్దు కావడంతో 2003 నుంచి స్కూల్ స్థాయి నుంచి ప్రమోషన్‌లు కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌గా రావాల్సి ఉండగా జీవో రద్దుతో ఆగిపోయింది. అప్పటి నుంచి ప్రమోషన్‌లు లేకపోవడంతో కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌లు కరువయ్యారు. అప్పటి నుంచి ప్రభుత్వం కూడా రిక్రూట్‌మెంట్ చేయకపోవడంతో కళాశాలల్లో క్రీడలు ఆడిపించే వారు కరువయ్యారు. అండర్-19 విభాగంలో క్రీడాపోటీలు జరగాల్సి ఉన్నా కళాశాలల్లో పీడీలు లేకపోవడంతో క్రీడాకారులు ఎంపికలకు వెళ్లడం లేదు.

నష్టపోతున్న క్రీడాకారులు..

అండర్-19 క్రీడా పోటీల్లో ఇంటర్మీడియెట్ కళాశాలలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొనాల్సి ఉంటుంది. వీటి కోసం ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పాఠశాల స్థాయిలో లాగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీని నియమిస్తుంది. ప్రస్తుతం కళాశాలల్లో పిడిలు లేకపోవడంతో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లేరు. క్రీడల కోసం ప్రత్యేకంగా ఉండే ఎస్‌జీఎఫ్ సెక్రెటరి లేకపోవడంతో క్రీడల నిర్వహణ ఆ శాఖకు భారంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఒకే ఒక్క పీడీతో ఎస్‌జీఎఫ్ క్రీడలను ముందుకు సాగించిన ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆ పీడీ కూడా రిటైర్డ్‌మెంట్ కావడంతో ఎస్‌జీఎఫ్ సెక్రెటరి పోస్టు ఖాళీగా ఉంది. కళాశాల స్థాయిలో ఎంపికల నిర్వహణ బాధ్యత మొత్తం ఎస్‌జీఎఫ్ సెక్రెటరీకి ఉంటుంది. ఎస్‌జీఎఫ్ సెక్రెటరి లేకపోవడంతో ఏ క్రీడా ఎంపికలు ఎప్పుడు ఉంటాయనేది కళాశాల విద్యార్థులకు తెలియడం లేదు. కొందరు పాఠశాల స్థాయిలో జాతీయ స్థాయిలో ఆడి కళాశాల స్థాయిలో క్రీడలు జరగకపోవడంతో కళాశాల వరకే క్రీడలను ఆడి ఆపి వేస్తున్నారు. దీంతో క్రీడాకారులు నష్టపోతున్నారు. ఎంపికలను సైతం నిర్వహించకపోవడంతో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికలకు వెళ్లలేక నష్టపోతున్నారు. క్రీడల్లో అండర్-19 విభాగంలో వచ్చిన సర్టిఫికెట్లకు ఉన్నత విద్యలో రిజర్వేషన్ ఉంటుంది. ప్రస్తుతం అండర్-19 విభాగంలో క్రీడల్లో ఎంపికలు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. కొందరు జిల్లాలోని ఔత్సాహిక క్రీడా కోచ్‌లు క్రీడా ఎంపికలను తెలుసుకొని అండర్-19 విభాగంలో ఎంపికలను నిర్వహిస్తున్నారు.

ఫిజికల్ డైరెక్టర్లను నియమించాలి..

: వినయ్‌సాగర్, టేబుల్ టెన్నిస్ కోచ్

జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ లేకపోవడం సిగ్గు చేటు. ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లేకపోవడంతో స్వతాహాగా ఎంపికల తేదీలను తెలుసుకొని క్రీడాకారులను ఎంపికల్లో పాల్గొనేలా చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల, కళాశాలల స్థాయిలో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి.

క్రీడాకారులు నష్టపోతున్నారు..

: రవికుమార్, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి

జిల్లాలో ఉన్న 15 కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేరు. గతంలో ఉన్న ఒక్క ఫిజికల్ డైరెక్టర్ రిటైర్డ్ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ కమీషన్ సర్వీస్ ద్వారా కొత్త రిక్రూట్‌మెంట్‌కు ఆలోచన చేస్తుంది. ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో క్రీడాకారులు నష్టపోతున్నారు. అయినా క్రీడల మీద ఆసక్తితో వివిధ క్రీడల్లో ఎంపికలను నిర్వహించి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నాం.

లంచం తీసుకుంటూ..
పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి



నందిపేట పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్

- ఇంటి నెంబర్ ఆన్‌లైన్‌కు రూ.10వేలు డిమాండ్
- రూ.8వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- నందిపేటలో ఘటన

నందిపేట, సెప్టెంబరు 12: నందిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇస్సాపల్లి నవీన్ కుమార్ గురువారం ఏసీబీకి చిక్కారు. రూ.8వేలు లంచం తీసుకుంటుం డగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని కంఠం గ్రామానికి చెందిన సుభాష్ అనే ఆటోడ్రైవర్ నందిపేట పట్టణ కేంద్రంలో పద్మశాలి కళ్యాణ మండపం వెనుకాల రెండస్తుల భవనం కట్టుకున్నాడు. ఇంటి అనుమతి గతంలో పని చేసిన కార్యదర్శి వద్ద పొందాడు. ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలని ప్రస్తుత కార్యదర్శి ఇస్సాపల్లి నవీన్ ను ఇంటి యజమాని సుభాష్ కలిశాడు. ఆ పనికి గాను కార్యదర్శి రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.8వేలకు ఒప్పందం కుది రింది. దీంతో బాధితుడు సుభాష్ వారం రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం పథకం ప్రకారం రూ.8వేలు లంచం కార్యదర్శి నవీన్ కుమార్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.8వేల నగదు, రికార్డులను సీజ్ చేశారు. నిందితుడిపై చర్యల నిమిత్తం విచారణ చేస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064కు డయల్ చేయాలని ఏసీబీ డీఎస్పి శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, వేణు, నాగేష్ సిబ్బంది ఉన్నారు.

బాల్కొండలో ముగిసిన అంతర్ పాఠశాలల క్రీడలు



కృష్ణవేణి పాఠశాలకు బహుమతి అందజేస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

ముప్కాల్, సెప్టెంబరు12: బాల్కొండ మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్ లో జరుగు తున్న 69వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అంతర్ పాఠశాల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. బాల్కొండ కేటీ ఎస్ ముప్కాల్ హైస్కూల్ మధ్య జరిగే కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. సొంత ఖర్చులతో క్రీడామై దానం అభివృద్ధి చేస్తానన్నారు. నియోజక వర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధునా తన మరుగుదొడ్లను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు క్రీడల్లో విజేతలకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ప్రధానం చేశారు. వాలీబాల్ అండర్-14 బాలుర విభాగం లో విజ్ఞాన్ హైస్కూల్ ప్రథమ, పోచంపాడ్ హైస్కూల్ ద్వితియస్థానం, బాలికల విభాగం లో హైస్కూల్ రెంజర్ల ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ పోచంపాడ్ ద్వితియ స్థానంలో నిలిచింది. బాలుర అండర్-17 విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ బాల్కొండ ప్రథమ, హైస్కూల్ రెంజర్ల ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో టీఆర్ఈఐఎస్ బాల్కొండ ప్రథమ, విద్య హైస్కూల్ పోచం పాడ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఖోఖో అండర్-14 బాలుర విభాగంలో టీజీఆర్ఎస్ పోచం పాడ్ ప్రథమస్థానం, సెంటియస్ కిసాన్ నగర్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో బాల్కొండ ఎంజీపీ ప్రథమ స్థానం, టీజెఆర్ఎస్ పోచంపాడ్ ద్వితీయ స్థానం నిలిచింది. ఖోఖో అండర్ -17 బాలుర విభాగంలో టీజీఆర్ఎస్ పోచం పాడ్ ప్రథమ, ముప్కాల్ హైస్కూల్ ద్వితీయస్థానం, బాలికల విభాగంలో కేజీబీవీ బాల్కొండ ప్రథమ, టీజీ డబ్ల్యుఆర్ఎస్ పోచంపాడ్ ద్వితీయస్థానంలో నిలిచింది. కబడ్డీ అండర్ -14 బాలుర విభాగంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ పోచంపాడ్ ప్రథమ, హైస్కూల్ బాల్కొండ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో టీజీ ఆర్ఎస్ పోచంపాడ్ ప్రథమ, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఎల్కటూర్ ద్వితీయస్థానంలో నిలిచింది.

నిజామాబాద్ శివారులోని స్టార్ హోటల్‌లో వ్యభిచారం

- సీపీ ఆదేశాలతో దాడి చేసిన పోలీసులు
- పట్టుబడిన 8మంది విటులు, ఐదుగురు యువతులు
- వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ..
- లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 12 : నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులో గల ఓ స్టార్ హోటల్‌లో వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో.. బుధవారం అర్ధరాత్రి పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. నిజామాబాద్ సీసీఎస్, డిచ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా హోటల్‌పై దాడి చేసి.. ఎనిమిది మంది విటులతో పాటు ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో ఖాందేశ్ అశోక్‌తోపాటు ద్వారకానగర్‌కు చెందిన నల్ల శ్రీనివాస్, మెండోరాకు చెందిన సామ గంగాధర్ అలియాస్ గంగారెడ్డి, రాజ, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన కుంట లింగన్న, అలాల లింగారెడ్డి, సింగిరెడ్డి భరత్‌లు ఉన్నారు. వీరితో పాటు హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ ఉంతూరు మధుసూదన్ కూడా పట్టుబడిన వారిలో ఉన్నారు. దీంతో యువతులను తీసుకురావడంలో ఇతని పాత్ర ఎంత మేరకు ఉందన్న విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైటెక్ పద్ధతిలో వాట్సాప్ గ్రూపుల ద్వారా మధుసూదన్ విటులను ఆకర్షిస్తున్నట్టు తెలిసింది. ఈ దాడిలో 13సెల్‌ఫోన్‌లతో పాటు రూ. 38,760ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారి వద్ద నకిలీ కరెన్సీ పట్టుబడింది. దీంతో ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన యువతులు, విటుల వద్దకు నకిలీ నోట్లు ఎలా వచ్చాయి!? ఈ నోట్ల చెలామణిలో ఎవరి పాత్ర ఎంత ఉంది !? అన్న విషయమై ఆరా తీసే పనిలో పడ్డారు. మరోవైపు.. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ ప్రత్యేక ఆదేశాలతో ఈ దాడి జరగడంతో.. స్టార్ హోటల్ యాజమాన్యం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఈ దందా బయటికి ఎలా పొక్కిందో తెలియక ఆందోళన చెందుతున్నట్టు తెలిసింది.

దౌర్జన్యాలు చేస్తే ఊరుకునేది లేదు

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

వర్ని, సెప్టెంబర్ 12: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయన అనుచరులు కొనసాగిస్తున్న దౌర్జాన్యాలను చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని అందుకు సరైన రీతిలో సమాధానం చెబుతామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం రాత్రి వర్ని మండల కేంద్రంలో పోచారం అనుచరుల దాడిలో గాయపడ్డ సీనియర్ కార్యకర్త భీమ శంకర్‌ను పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. నిన్న గాక మొన్న టీఆర్ఎస్ పార్టీని వీడి తమ పార్టీలోకి వచ్చిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో మా కార్యకర్తలపై దాడికి పాల్పడడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. పోచారం కొనసాగిస్తున్న అరాచకాలపై సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో సీనియర్ నాయకులు యలమంచి శ్రీనివాస్ రావు, పాత బాలకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ సింగ్, రెడ్డి రాంబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 12: సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని బోధన్ సీపీఎం పార్టీ నాయకులు శంకర్‌గౌడ్, ఏశాల గంగాధర్‌లు అన్నారు. కార్మికుల హక్కుల కోసం సుదీర్ఘ పోరాటం చేసిన ఏచూరి మరణం తీరని లోటన్నారు. గురువారం బోధన్‌లో సీపీఎం పార్టీ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రజెండాను ఆవిష్కరించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఏచూరి మరణం పట్ల నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దండు సాయిలు, సుంకరి లక్ష్మి, షేక్ అజీం, దండు రాణి, అనిత, శ్రీనివాస్‌లున్నారు.

మల్లారంలో అర్బన్ ఎమ్మెల్యే పూజలు

మోపాల్, సెప్టెంబరు 12: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని గణేష్ మండపాల వద్ద గురువారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు అర్బన్ ఎమ్మెల్యేతో పూజలు చేయించారు. గ్రామానికి వచ్చిన ఆయనను ఘనంగా సన్మానించారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేసిన డీఎల్‌పీవో

ముప్కాల్, సెప్టెంబరు 12: బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో గురువారం పారిశుధ్య పనులను డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. ఇళ్లలో నీటినిల్వ లేకుండా లార్వా స్ప్రే చేయాలని ఆయన సూచించారు. మురి కికాలువల్లో పిచ్చిమొక్కలను తొలగించి, పూడికతీయ పనులన వేగవంతం చేయాలని అన్నారు. పంచాయతీ కార్యాలయంలో హెల్త్, అంగన్‌వాడి సిబ్బంది సమన్వయంతో వ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఈవో విజయభాస్కర్‌రెడ్డి, ఏంపీవో గంగామోహన్, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జిల్లాలో నిడ్రా ఏర్పాటు చేయాలి : కేశవులు

పెద్దబజార్, సెప్టెంబరు 12 : హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా మాదిరి జిల్లాలో కూడా నిడ్రా ఏర్పాటు చేయాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి.కేశవులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఖలీల్‌వాడిలోగల కేశవులు ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని పూలాంగ్ వాగుతో పాటు ఆర్మూర్, బోధన్, భీంగల్, డిచ్‌పల్లి ప్రాంతాలలోని చెరువులు, కుంటలు, నిజాంసాగర్ కాలువ కట్టల వద్ద కబ్జాలపై గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పార్కులు ఆక్రమణలకు గురయ్యాయని వీటి నిరోధానికి నిడ్రా ఏర్పాటు చేయాలన్నారు. నగర శివారులోని నిజామాబాద్, బోధన్ రహదారి పక్కన రామర్తి చెరువు విస్తీర్ణం సుమారు 30 ఎకరాలు కాగా.. ప్రస్తుతం 15 ఎకరాలు కూడా లేదన్నారు. భీంగల్‌లో దాదాపు 73 ఎకరాల విస్తీర్ణంలోని రథం చెరువు శిఖం ప్రాంతం 10 ఎకరాలకు మించి ఆక్రమణకు గురైందని ఆయన అన్నారు. జిల్లాలో చెరువులు శిఖాలు, కాల్వల బంపర్ జోన్‌లలో నిర్మాణాలు చేపడుతుంటే నీటిపారుదల శాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా లాంటి ఏజెన్సీలను నెలకొల్పి పర్యావరణాన్ని పరిరక్షించాలని భవిష్యత్తు తరాలకు అన్యాయం చేయవద్దన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు'

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 12: ప్రతీఒక్కరు తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం అలవాటు చేసుకోవాలని, వృద్ధాప్యంలో వారిని నిర్లక్ష్యానికి గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్ కోమన్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో జరిగిన హెచ్‌ఎం కవిత సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతీఒక్కరు మంచి అలవాట్లను నేర్చుకోవాలని, తోటివారిని, పెద్దలను గౌరవించే సంప్రాదాయాలను కలిగి ఉండాలన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్‌గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా టీపీసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. పీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

పీజీ అడ్మిషన్‌ల కోసం ప్రత్యేక డెస్క్‌లు



టీయూలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

డిచ్‌పల్లి, సెప్టెంబరు 12 తెలంగాణ వర్సిటీలో పీజీ నూతన అడ్మిషన్లకు సందర్భంగా పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్ ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు పీజీ విద్యార్థులకు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వర్సిటీకి వచ్చే విద్యార్థులకు ఏటువంటి ఇబ్బందులు రాకుండా అడ్మిషన్స్ సాఫీగా జరిగేందుకు తాము ఈ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విద్యార్థులకోసం మాస్ కమ్యూనికేషన్ విభాగం విద్యార్థులు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని సంతకాల సేకరణ

మోపాల్, సెప్టెంబరు 12: గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ గురువారం పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మండలంలోని సిర్పూర్ గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాలకు బస్సులను నడపకపోవడంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు రాకపోవడం వల్ల ప్రైవేటు ఆటోల్లో వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సులు నడిపేలా చూడాలని నాయకులు, గ్రామాల మహిళలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్సైగా ఎంపికైన గ్రంథాలయ పాఠకురాలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 12: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమైన గ్రంథాలయ పాఠకురాలు సుహాసిని ఎస్సైగా ఎంపికైనట్లు జిల్లా ఉప గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాజారెడ్డి తెలిపారు. పోటీ పరీక్షల్లో గత కొన్ని నెలలుగా చదువుకుంటున్న అనేక మంది విద్యార్థులతో పాటు సుహాసిని సైతం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రంథాలయంలో ఉండి చదువుకుందని అన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి సంస్థ అనేక ఏర్పాట్లు చేయడంతో పాటు పుస్తకాలు అందుబాటులో ఉంచిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజేతగా నిలవడం ఆనందాన్ని ఇస్తుందని అన్నారు.

గణేష్ మండపాల ఆకస్మిక తనిఖీ

వేల్పూర్, సెప్టెంబరు12: వేల్పూర్ మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను గురువారం ఎస్సై నాగనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది ప్రతీరోజు మండపాల వద్ద వస్తున్నారా లేదా అని గణేష్ మండపాల నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. వారి వద్ద పోలీస్‌సిబ్బందికి సంబంధించిన హాజరు బుక్‌ను పరిశీలించారు. గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలను అందరు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

రేపు అండర్-19 క్రికెట్ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అండర్-19 క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల బాలురు ఉదయం 10గంటల వరకు క్రీడామైదానానికి చేరుకోవాలన్నారు. క్రీడాకారులు 16 నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, 10వ తరగతి మెమో, వయస్సు ధ్రువీకరణ పత్రం వెంటతీసుకురావాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా తెల్లని దుస్తులు ధరించాలి రావాలన్నారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఈనెల 20న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు కోచ్ సురేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 14 నుంచి 19 వరకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిగతా వివరాల కోసం 9849202586 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 12: మండల ప్రత్యేక అధికారి యోహాన్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ధర్మారం హాస్టల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ధర్మారంలోని జ్యోతిబాఫూలే, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ కళాశాలలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలన్నారు. నడిపల్లి జీపీ, అంగన్ వాడీ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈవో నిట్టు కిషన్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు మండలంలోని అన్ని గ్రామాల్లో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో

ధర్పల్లి, సెప్టెంబరు 12: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో స్వర్ణలత అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషక అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి గర్భిణీలు, బాలింతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతల కోసం పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఆమె చెప్పారు. గర్భిణీలకు అందిస్తున్న ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అక్షరభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల నుంచి తెచ్చిన పోషక పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎండివో బాలకృష్ణ, ఎంఆర్‌వో మాలతి, పోషక కోఆర్డినేటర్ రంజిత్, మహిళా సాధికారత అధికారి కవిత, సూపర్ వైజర్ బుజ్జి,సరిత,మండల వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీలో పోషణ మాసంపై అవగాహన

ఎర్గట్ల: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో గురు వా రం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వారి తల్లిదండ్రులకు పోషణ మాసంపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా పోషణ మాసంలో భాగంగా తల్లి పాలు, పరిపూర్ణమైన ఆహారంపై అవగాహన, చిన్నారులకు ఆరోగ్యకరమైన పోటీలు, ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎల్‌ఎమ్ ఆరోగ్య లక్ష్మీ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ నిర్వాహకులు అనురాధ, రాజమణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా మహిళలకు పౌష్టికాహారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషోర బాలికలకు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా



తాళ్లరాంపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, ఏఎన్‌ఎం రజిని, అంగన్‌వాడీ టీచర్‌లు సరోజ, సునీత, గంగామణి, గోదావరి, మహదేవి, ఆశా వర్కర్‌లు, కిషోర బాలికలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: మండలంలోని గోనుగోప్పుల గ్రామంలో నాలుగు అంగన్‌వాడి కేంద్రాల్లో పోషణమాసం కార్యక్రమంలో ఘంగా ప్రీ స్కూల్ విద్యప్రాధాన్యతపై గురువారం భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ శ్రీదేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రియదర్శిని న్యూలబస్ ప్రకారం మండలంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు ప్రీ స్కూల్ విద్య, అలాగే అంగన్‌వాడి మెను ప్రకారం భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు, ఎఎన్‌ఎం శోభ, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

వర్నిలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వర్గీయుల ఘర్షణ

● ఆరుగురిపై కేసు నమోదు

వర్ని,సెప్టెంబరు 12: వర్ని మండల కేంద్రంలో బుధవారం రాత్రి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అనుచరులు ఘర్షణకు దిగారు. రెండు వర్గాల మధ్య వివాదం నెలకొని పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్‌ఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తెచ్చారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు భీమ శంకర్ గత కొన్ని నెలలుగా అసభ్యకర వ్యాఖ్యలతో వీడియో సందేశాలను వాట్సప్ గ్రూపుల్లో పంపడంతో అదే పార్టీకి చెందిన కొందరు నాయకులు ఆగ్రహించి భీమ శంకర్ ఇంటిపై దాడి చేసి చితక బాదినట్లు తెలుస్తోంది. కాగా మండల కేంద్రంలో దాడులకు పాల్పడి ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణ కుమార్ తెలిపారు.

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు 341 ఆర్టికల్‌కు వ్యతిరేకం

● మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్త దయానంద్

మోర్తాడ్, సెప్టెంబరు12: ఎస్సీ కులాలను వర్గీకరించడం, ఎస్సీలలో క్రిమిలేయర్ విధానాన్ని పాటించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు 341 ఆర్టికల్‌కు వ్యతిరేకమని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్త దయానంద్ అన్నారు. గురువారం మోర్తాడ్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మాలకులాల మనోభావలను మానసికంగా వేదనకు గురి చేసిందని అన్నారు. భారతదేశంలో ఎస్సీరిజర్వేషన్‌లు, ఎస్సీల అంటరానితనం కారణంగా రిజర్వేషన్‌లు ఇవ్వబడ్డాయని, అంటరానితనం ఉన్నంత సేపు దేశంలో ఎస్సీలకు క్రిమిలేయర్ వర్తించదని అన్నారు. సుప్రీం ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ తీర్పును రివ్యూ చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో పులి అశోక్, సుందర్‌రావు, రాజు పులే, రాంచందర్, రంజిత్, రాజేష్‌లు పాల్గొన్నారు.

న్యాయవాదిపై భౌతికదాడిని ఖండించిన జిల్లా బార్

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 12: జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావుపై భౌతికదాడి చేసిన నవాతే జగన్మోహన్ తీరును బార్ అత్యవసర సమావేశంలో పలువురు సీనియర్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ అత్య వసర సమావేశంలో అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ కార్యదర్శిపై సస్పెండ్ అయిన న్యాయవాది, దాడిచేసిన న్యాయవాది ఈవృత్తికి అనర్హుడని తీవ్రంగా ఖండించారు. అనంతరం కృపాకర్‌రెడ్డి, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి,శ్రీహరి ఆచార్య, ఎర్రం గణపతి, తదితరులు మాట్లాడుతూ కోర్టుప్రాంగణంలో కార్యదర్శిపై దాడి చేయడం అనేది చట్టవిరుద్ధంగా వ్యవహరించడమేనని గతంలో కూడా ఎన్నో తప్పిదాలు చేస్తే బార్ కౌన్సిల్ మందలించారని అన్నారు. అయినా ఆయన తీరు మార్చుకోలేదని పేర్కొన్నారు. తన వ్యవహారశైలిని బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తామని ఈ సమావేశంలో వారు తెలిపారు.అనంతరం జరిగిన సంఘటనపై ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో ఒక కమిటీని నియమించి నవాతే జగన్మోహన్‌పై మరిన్ని కఠిన చర్యలు తీసుకొని బార్ అసోసియేషన్ సభ్యత్వం నుంచి తక్షణమే తొలగించాలని జిల్లా కోర్టులో న్యాయవాదులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ సభ్యులు పి.రాజు, సురేష్ ధన్‌పాల్, అయ్యూబ్, తదితరులు పాల్గొన్నారు.

రోగుల సహాయ కేంద్రం నిర్వాహణకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయ కేంద్రాన్ని నిర్వహించేందుకు ఔత్సాహికుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు నగర పాలక సంస్థ కమీషనర్ మంద మకరంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సేవా కేంద్రాన్ని నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, పట్టణ సమైక్యలు, నెహ్రూ యువ కేంద్రాలు, సంక్షేమ సంబంధ సంస్థల వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 13 నుంచి 21లోపు నగర పాలక సంస్థలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కోటగిరి,సెప్టెంబరు 12: కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో పేకాట కేంద్రంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పేకాట కేంద్రంపై దాడి చేశామన్నారు. పేకాట కేంద్రం వద్ద రూ.5520 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాన్కంపేట్‌లో భగవద్గీత గ్రంథాల పంపిణీ

వేల్పూర్, సెప్టెంబరు12: మండలం జాన్కంపేట్‌లో హిందు యువ సేన. ఏలిఫెంట్ యూత్, కుర్మయాదవ, ఆధ్వర్యంలో గురు వారం ఇంటింటికి భగవద్గీత గ్రంథాల వితరణ చేశారు. అంతకు ముందు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సభ్యులచే (ఇస్కాన్ భక్తబృందం) కీర్తనలు, భజనలతో గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వ హించారు. భగవద్గీత సమస్త మానవకోటికి ఉన్నత జీవనానికి మార్గదర్శకం చేసే గ్రంథం అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చ అధ్య క్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భా గంగా ఇంటింటికి భగవద్గీత గ్రంథాలు అందించడం గొప్ప విషయమని, అందుకు యూత్ సభ్యులందరు ఆదర్శవంతంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, హిందు యువజేన సభ్యులు హస్నాజీ,.దనుంజయ్, శేఖర్, విగ్నేష్, శెట్టి గంగాధర్, దినేష్ , ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

నవీపేట,సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన కారంగ్ పురి రాధాకిషన్ అనే 23సంవత్సరాల యువకుడు అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 4న బయటకు వెళ్లిన రాధాకిషన్ తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. అతడికి గత కొంతకాలంగా మానసిక స్థితి బాగాలేదని అన్నారు. తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధరణిలో తమ భూముల సమస్యలను పరిష్కరించాలి

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 12: ధరణిలో నెలకొన్న తమ భూముల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మికులు నిజాంషుగర్స్ భూముల విస్తీరణ హెచ్చుతగ్గులను సరిదిద్దాలని కోరుతూ పొతంగల్ మండలం జల్లాపల్లి ఫారం రైతులు గురువారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎంఏ హకీం మాట్లాడుతూ నిజాం చక్కెర కర్మాగారం జాయింట్ వెంచర్ సందర్భంగా కర్మాగార యాజమాన్యం వారికి చెందిన భూములను అక్కడ పని చేస్తున్న కార్మికులకు అందజేసిందని తెలిపారు. భూములను పొంది 20ఏళ్లు గడుస్తున్న ప్పటికీ లబ్ధిదారుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులకు పాత పాస్‌బుక్‌లు ఉన్న డిజిటల్ పాస్ బుక్‌లు ఇవ్వలేదని తెలిపారు. కొందరు రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వలేదని పేర్కొన్నారు. డిజిటల్ పాస్‌బుక్‌లు అందజేసిన కొందరు రైతుల వివరాలు ధరణిలో చూపించడం లేదని పేర్కొన్నారు. తమ భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు షేక్.ముక్తార్, మున్నా నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్‌రూరల్,సెప్టెంబరు12: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే నిజామాబాద్ జిల్లా జట్టును గురువారం పెర్కిట్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు క్రీడాకారులు హాజరుకాగా వారిలో నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను సబ్‌జూనియర్ బాలుర జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, ప్రధానకార్యదర్శి పింజ సురేందర్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14వ తేదీనుచి హన్మకొండలో జరగనున్న 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పేట సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, గరడి రాజేష్, హాకీ సంఘం అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రిన్సిపాల్ పెల్లి, హాకీ సంఘం ప్రధానకార్యదర్శి సదమస్తుల రమణ, అంజు, రాహుల్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ఖిల్లా, సెప్టెంబరు 12: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు చట్టాన్ని గౌర వించే పౌరులు, మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన, వికృత, అసభ్యకరమైన ప్రవర్తనను ప్రదర్శిస్తే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మద్యాన్ని సేవించే వారు మహిళలను, పిల్లలను ఆటంకం కలిగించి ప్రజాప్రశాంతతకు దారి తీస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వికృత సభ్యప్రవర్తన వల్ల పౌరుల్లో, మహిళల్లో, పిల్లల్లో భయాందోళన భావాన్ని కలిగిస్తోందని, దీని ఫలితంగా కమిషనరేట్ పరిధిలో వారి స్వేచ్ఛ సంచారాన్ని నిరోధించడం ద్వారా ప్రజల భద్రతపై పెద్ద మొత్తంలో ప్రభావం చూపుతుందన్నారు. మహిళలు, పిల్లలు, మానవ ప్రాణాలకు భద్రత, భద్రతగల ప్రమాదాన్ని నివారించడానికి, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకుండా నిరోధించడానికి ఈ విషయంలో చర్యలు తీసుకోవడం అవసరమని భావిస్తున్నామన్నారు. పైన పేర్కొన్న వాటిని పరిగణలోకి తీసుకొని అండర్ సెక్షన్ 22 (1), (డి) హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ 1948 ఎఫ్ ప్రకారం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. మద్యం సేవించేవారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేదించుకోవాలని ఆదేశించారు. ఈనెల 11 ఉదయం 6గంటల నుంచి 30వ తేదీ ఉదయం 6గంటల వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే వారిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ 1348 ఫాస్లిలోని సెక్షన్ అండ్ (76) ప్రకారం శిక్షకు అర్హులు అవుతారని హెచ్చరించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని మానుకోవాలని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 12: బోధన్ మండలంలోని నాగన్‌పల్లి, సాలంపాడ్ గ్రామాలల్లోని పంట పొలాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ వైర్‌లను గుర్తు తెలియని దొంగలు దొంగలించినట్లు రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లలోని కాపర్ వైర్‌లను దొంగలించడం జరిగిందని, ఆయా పంట పొలాల రైతులు, ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. సీసీ పుటేజీ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి దొంగలను పట్టుకుంటామన్నారు.

అంకాపూర్‌లో జడకొప్పు ఆట ప్రదర్శన

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు12: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో హిందు సమితి ఆధ్వర్యంలో గురువారం జడకొప్పు ఆటను కళాకారులు ప్రదర్శించారు. వినాయక మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయడం వల్ల శబ్ద కలుష్యం ఏర్పడుతుందని, ఇందుకు ప్రత్యామ్నాయంగా ప్రాచీన కళలను రక్షించుకునే ఉద్దేశంతో జడకొప్పు ఆటను ప్రదర్శించినట్టు హిందు సమితి వారు తెలిపారు. మోపాల్ మండలం బాడ్సి గ్రామానికి చెందిన 30మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రజలు జడకొప్పు ఆటను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, కళాకారుల బృందం సభ్యులు, మహిపాల్‌రెడ్డి, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

దేశం నుంచి రాహుల్‌గాంధీని బహిష్కరించాలి: బీజేవైఎం

పెద్దబజార్, సెప్టెంబరు 12: దేశం పరువు తీసేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని దేశం నుంచి బహిష్కరించాలని బీజేబీవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందు నుంచి కూడా వక్రబుద్ధిని ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో భారతదేశం పరువు తీసేలా మాట్లాడుతున్నారని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి దేశం ముందుకు పోవడం లేదని మాట్లాడటం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. భారతదేశం గురించి, హిందుత్వం గురించి ఎవరూ మాట్లాడిన సహించమని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడం సరైందికాదన్నారు. భారతదేశం ప్రజానికానికి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటేనన్నారు. తెరాస ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎర్రం సుధీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తిక్, నరేష్, కృష్ణ, చిరంజీవి, విపుల్‌రావు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు12: పట్టణంలోని రాంనగర్, జిరాయత్‌నగర్‌లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు లోక భూపతి రెడ్డి 58వ బూత్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించగా నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభిమానులు సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా సైతం సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్ పుప్పాల శివ రాజ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కార్యదర్శి పొల్కం వేణు, బారడి వినోద్, డికె.శ్రీనివాస్, దత్తాద్రి, ఈశ్వర్, వినోద్, చందర్, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: భారత దేశానికి మోదీ అవసరం ఎంతైనా ఉందని మోదీని బలపర్చాడానికి ప్రతీఒక్క కార్యకర్త సైనికులుగా పని చేసి సభ్యత్వ కార్యక్రమాన్ని ఉద్ధృతం చేయాలని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ప్రముఖ్ గంగోని సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు చర్చించారు.ఈ కార్య క్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, యువమోర్చ కార్యదర్శి గంగారెడ్డి, ఓబీసీ మోర్చ కన్వీనర్, మండల ప్రధానకార్యదర్శి రాజు, రాజశేఖర్, సంజీవ్, తదితరులు పాల్గొ న్నారు.

గణపతి మండపాలకు 5 క్వింటాళ్ల బియ్యం పంపిణీ



డొంకేశ్వర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న శ్యామ్‌గౌడ్

డొంకేశ్వర్, సెప్టెంబరు12: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 15గణపతి మండపాలకు గురువారం బియ్యాన్ని పంపిణీ చేశారు. డొంకేశ్వర్ గ్రామానికి చెందిన శ్యామ్‌గౌడ్ ఇన్ఫినిట్ యూత్, బ్రదర్స్ యూత్, లయన్స్ యూత్‌లతో పాటు మిగతా సభ్యులకు, 15గపతి మండపాలకు ఐదు క్వింటాళ్ళ బియ్యాన్ని నిర్వాహకులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కిని సిద్దార్థ, సుంకరి నాగరాజు, ముఖేష్ యాదవ్, సుధాకర్, తది తరులు పాల్గొన్నారు.

ఇస్సాపల్లిలో పసుపు పంట పరిశీలన

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు12: ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో గురువారం పసుపు పంటలను జిల్లా ఉద్యానవన శాఖ జేడీ బండారు శ్రీనివాస్, పసుపు పరిశోధన శాస్త్రవేత్త మహేందర్‌రెడ్డిలు పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు పంటలకు మర్రకు తెగులు, దుంకుళ్ళ రోగం వచ్చే అవకాశాలు ఉన్నాయని తెగులు నివారణకు, సస్యరక్షణకు క్రోపికోనజోల్ లేదా సాఫ్ లేదా టాప్సుమ్ ముందులను పిచి కారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ ర్మూర్ ఏరియా అగ్రికల్చర్ అధికారిణి సంధ్యరాణి, రైతులు నూ తుల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం శ్రీనివాస్, దార్ల పెద్ద ముత్తెన్న, కోమటి సాయన్న, భాను, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

పెద్దబజార్, సెప్టెంబరు 12: గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడం అంతర్జాతీయ స్థాయిలో వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. గురువారం ఆయన మృతి భారత దేశ వామపక్ష ఉద్యమానికి కోలుకోలేని దెబ్బలాం టిదన్నారు. బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.